కథా నిలయం
4650
శ్రీకాకుళం

# (ప్ర) స్థానం

ఆరేళ్ళ పాపతో ఆమె గవర్నమెంట్ స్కూలు ఆవరణలోకి అడుగుపెట్టింది. అప్పుడు డ్రిల్ పీరియడ్. స్కూలు పిల్లలంతా ముద్దుగా, బొద్దుగా వున్న మరో మిత్రురాలెవరో స్కూల్లో చేరుతుంది అన్నంత ఆశగా, సంతోషంగా పాపవైపు చూస్తున్నారు. ఆ పాప చూపులు మాత్రం భయంగా బిక్కుబిక్కుమంటున్నాయి. పాపతో నీలిమ స్టాఫ్ రూంలోకి నడిచింది. ఆ గదిలోనే ఓ మూలన హైడ్మాస్టర్ కుర్చీ వుంది. టీచర్లందరు ఓసారి ఆమెను చూసి మళ్లీ కబుర్లలో పడ్డారు.

హెడ్మాస్టర్‌ని గుర్తించి రెండు చేతులెత్తి నమస్కరించింది నీలిమ. అతడు ప్రతి నమస్కారం చేసి 'కూచోండి. పాపని జాయిన్ చేస్తారా?' అనడిగాడు. నీలిమ కూచుంది. పాపకూడా నమస్తె సర్ అంది తల్లి ప్రక్కనే నిలబడతూ. హెడ్మాక్టర్‌కి నీలిమని చూడగానే ఎందుకో... చప్పున అలిశెట్టి ప్రభాకర్ కవిత గుర్తొచ్చింది. వెంటనే ఆలోచనల్ని విదిలించి, తన మనసుని తమాయించుకుంటూ 'పాప పేరేంటి?' అనడిగాడు అడ్మిషన్ రిజిస్టర్ తీస్తూ..

"పులకిత యామిని'' చెప్పింది నీలిమ.

"ఏ వాడ?''

"దొమ్మరివాడ''

స్కూలుమీద బాంబు పడ్డట్టు ఉలిక్కిపడి చూసారు టీచర్లంతా ఆమెవైపు. రిజిస్టర్‌లో రాయబోతున్న హెచ్. ఎం. పెన్ను ఆగిపోయింది. నిశ్శబ్దంగ కళ్లు పైకెత్తి ఆమె వైపు చూసాడు.స

నిశ్చలంగా... నిర్మలంగా... కళ్లలోతుల్లో కన్పడని భావాలతో.. నిర్వేదంగా మళ్లీ చెప్పింది.

"దొమ్మరి వాడ సార్"

స్టాఫంతా ఆమెను జురాసిక్ పార్క్‌లో బల్లిని చూసినట్టుగా చూస్తున్నారని గమనించిన హెచ్. ఎం. 'పాప తండ్రి పేరు చెప్పండి' అన్నాడు నిదానంగా

"తండ్రెవరో తెలీదు సార్"

స్టాఫ్ రూంలో ఒక్క సారిగా వాతావరణం గంభీరంగా మారింది. హెచ్. ఎం. చాలా సౌమ్యంగా చెప్పాడు. 'తండ్రి పేరు తప్పని సరిగ రిజిస్టర్‌లో రాయాలి. లేదా గార్డియన్ పేరైనా రాయాలి'

.

"లేద్సార్... ఎవరి పేరని చెప్పను.. మా వృత్తిలో తండ్రులుండరు" అంది తలదించుకుంటూ

అందరి మధ్యా మౌనం...

కొందరి చూపులు ఆమె శరీరాన్ని తడిమాయి అప్పుడే. పాప బేలగా స్టాఫ్ రూంని, టీచర్లని చూస్తూ నిల్చుంది.

"ఎవరిదో ఒక పేరుండాలమ్మా... తప్పదు" నిశ్శబ్దాన్ని చెరిపేస్తూ చెప్పాడు హెచ్. ఎం.

"సార్... ముక్కోటి దేవతలున్నారు. వాళ్లలో సగం మంది మగాళ్లే. ఎవరిదో ఒక పేరు రాస్కోండి సార్. నా బిడ్డని జాయిన్ చేస్కోండి" అంది ప్రాధేయపూర్వకంగా ఆమెలోని సంస్కారానికి హెచ్. ఎం అబ్బురపడ్డాడు.

అప్పుడే ఇంగ్లీష్ టీచర్ రామనాథం వచ్చి "సార్... తండ్రి పేరు లేకుండా పిల్లని ఎలా జాయిన్ చేస్కుంటారు. అసలే విద్యాకమిటీకి మనకి పడట్లేదు. రేపేదైనా గొడవలొస్తే... అసలే మీరు రిటైర్మెంటుకు దగ్గరున్నారు.పెన్షన్స్‌లో లేనిపోని ప్రాబ్లెమ్స్‌క్రియేట్ అవుతాయి' అని ఉప్పేసాడు.

సైన్స్ టీచర్ ప్రభుదాస్ అందుకున్నాడు.

"సార్.. ఎం. ఆర్. వో ఆఫీస్ నుంచి ఏదైనా సర్టిఫికెట్ తెమ్మనండి. సర్టిఫికెట్ల వాళ్లు తండ్రి పేరు రాస్తారు కదా... దాన్ని బట్టి మనం జాయిన్ చేస్కున్నట్టు వుంటుంది'' ఫిలమెంటు తీగను కనుగొన్న ఎడిసన్ కూడా ఏనాడూ ఫీలైవుండడు. తన ఆలోచనకి తానే గొప్పగా ఫీలైపోతూ చెప్పాడు ప్రభుదాస్.

పమిట సర్దుకుంటూ రుక్మిణి టీచర్ వచ్చింది.

"ఇంతకీ సార్,,, వేశ్య కూతుర్ని స్కూల్లో జాయిన్ చేస్కుంటే మిగితా పిల్లలు, వాళ్ల తల్లిదండ్రులు వూరుకుంటారా? ఎందుకైనా మంచిది విద్యాకమిటీ వాళ్లచెవిలో వేయండి' అంది.

నీలిమ విస్తుపోతూ చూసింది.

"నాబిడ్డని జాయిన్ చేస్కోవడానికి విద్యాకమిటీతో చర్చించాలా? అంత నేరం మా పాపేం చేసింది? అంది నొచ్చుకుంటూ హెచ్. ఎం. తో. హెడ్మాస్టర్ రుక్మిణి టీచర్ వైపు కోపంగా చూసాడు. ఎక్కడో మారుమూల పాఠశాలలో వున్న రుక్మిణి జడ్. పి. చైర్మెన్ దగ్గర పడుకుంటేనే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయిందని ఆమె మీద ఓ పుకారుంది. దానికి తోడు ఆమె ప్రతి చిన్న విషయానికి చైర్మెన్ నాకు బాగా తెల్సు అంటుంది. హెచ్. ఎం. మనసు బరువెక్కింది.

'పగిలిన జీవితాన్ని నలిగిన యవ్వనంతో అతుకుబెట్టి వృత్తిపరంగా నలగురికీ తృప్తినిచ్చే, ఆమె తడారిన ఎడారి కళ్లలోని నీలినీడలు వీళ్లకు కన్పించవు... శరీరమే తప్ప ఆమె యవ్వనం కాలిపోతున్న చుట్టముక్కలా... జీవితం కారిపోతున్న కన్నీటి చుక్కలా సాక్షాత్కరించదు. శీలానికి వేలం పాడే సుఖభ్రష్టుల శృంగారంలో... పచ్చనోట్ల మీది కామహోమానికి ఆమె శీలమే ఆజ్యం.... నాగరికం పేరుతో నటించే రుక్మిణిలాంటి వాళ్లకన్న అది పూజ్యం....'

హెచ్. ఎం. కణతలు రుద్దుకున్నాడు ఆలోచనల్తో.... అతడు తలెత్తేసరికే ఆమె నొచ్చుకుందో... ఏమో.... పాపని తీసుకొని వేగంగా వెళ్లి పోయింది. టీచర్లంతా పీడ విరగడైనట్టు క్లాసుల్లోకి వెళ్లిపోయారు.

★ ★ ★

"అమ్మా... నేను చదువుకోను'' ఆరేళ్ళ యామిని తల్లితో అంది. అప్పటికే నీలిమ మనసంతా అన్యమనస్కంగా మారింది. ఏ పిల్లలకీ ఎదురుకాని సమస్య తన పాపకి ఎదురవటం ఆమె ఊహించనిది... భరించనిది!

యామిని తలపై నిమురుతుంటే 'కస్టమరొచ్చాడు' అంటూ సుబ్బులు చెప్పి యామినిని తీసుకొని వెళ్లింది. మానిక్‌చంద్ గుట్కా నములుతూ, చెమట కంపుతో, విస్కీవాసనతో ఓ లారీ డ్రైవర్ వచ్చాడు.

వస్తూనే మీద పడ్డాడు...

'తన బిడ్డకో తండ్రి కావాలి..

అమ్మ కడుపున పుట్టినా... అక్షరాలు నేర్చుకోవడానికి తన అమ్మతనం పనికిరాదు...

నాన్న కావాలి...

నీచుడో...

నికృష్టుడో...

ఎవడో ఒకడు...

వాడుకొని పోయే వాడే తప్ప... పిడికెడు అభిమానాన్ని పంచిపోయిన వాడెవ్వడు.

తనకి జీవితాన్ని ఇవ్వకపోయినా పర్లేదు... స్కూలు రిజిస్టర్‌లో పేరు నమోదుకైనా నా బిడ్డకి నాన్న కావాలి...

నాకు మొగుడొద్దు... నా బిడ్డకి తండ్రి కావాలి...'

ఆలోచనల్లోనే అమ్మా అని మూలిగింది. పశుబలంతో వాడెక్కడో గట్టిగా కొరికాడు. బాధగా కళ్లు మూసుకుంది.

'నా బిడ్డకి లోకజ్ఞానం నేర్పాల్సిన పనిలేదు... అక్షర జ్ఞానం సంపాదించడానికి అనుమతి పత్రంగా ఓ మగాడి పేరుంటే చాలు...

'అయ్యా' అని పిలువడానికి...'బాపూ' అని గారాబం పోడానికి.... 'నాన్నా' అంటూ చుట్టేయడానికి... 'డాడీ' అంటూ వాటేసుకోడానికి ... తండ్రి అక్కర్లేదు. పలకా, బలపంతో బళ్లో అడుగుపెట్టడానికి... ఓ మగాడి పేరు తోడుంటే చాలు... తానెప్పుడూ.. ఏ కస్టమర్ పేరూ అడగలేదు...

అయినా... పుట్టింది నా కడుపునైతే...

తండ్రి పేరెందుకు.. ???

తొమ్మిది నెలలు మోసింది తనైతే... తనని విడిచి వాడి పేరెందుకు? పురుటినొప్పులు పడి కన్నది నేనైతే... నా కడుపుని తొలిచిన ఆ మగ పురుగు పేరెందుకు?

నేనే తల్లిని...

నేనే తండ్రిని...

నేనే గార్డియన్‌ని...

నేనే గాడ్‌మదర్‌ని...

నేనే... నేనే... నేనే...''

నీలిమలో ఓ దృఢ సంకల్పం రూపుదిద్దుకుంది. లారీ డ్రైవర్ శరీరం కింద నలిగిపోతూ...

వాడి ఆవేశం చల్లారాక...

"థూ,,, నీయవ్వ. చచ్చిన శవం దగ్గర పడుకున్నట్టుంది' బూతులు తిడుతూ ప్యాంటు తొడుక్కొని వందనోటు మొహాన కొట్టి వెళ్లాడు.

మరో గంట తర్వాత నీలిమ తయారైంది. యామిని రాగానే ప్రేమగా దగ్గరికి తీసుకుంది.

"నీ పేరు పక్కన నాపేరు వుండేలా చేస్తానమ్మా..

పదేళ్లకే పైట జార్చటం నేర్చుకొని..

కన్నుకొట్టి కస్టమర్లని రప్పించే మన బతుకులే నిజమైన లోకం పోకడ తెల్సిన యోని వర్సటీలు...

ఇక్కడి ఒక్కో మూలుగు... ఒక్కో కన్నీటి బొట్టుని ఏ యూనివర్సిటీలు సైతం థీసిస్‌గా మలచలేవు.

వేశ్యల కూతుళ్లకు నాన్నలుండరని తెల్సి...తల్లులపేర్లు రాసుకోవాలని విద్యాలయాల తలరాతలు మార్చడానికి వెళ్తున్నాను...

నిన్ను బడిలో చేరుస్తాను....'' అంది బయల్దేరుతూ.

యామిని అమాయకంగా అడిగింది.

"ఎక్కడికమ్మా... మళ్లీ స్కూలుకా...?''

''కాదమ్మా... కడుపు చించుకంది నేనైతే... చెంచాడు వీర్యం దులుపుకెళ్లిన ఓ మగాడి పేరు కోరుతున్న చదువుల తల్లిని నిలదీయడానికి... ఓ తల్లిగా వెళ్తున్నాను... కో...ర్టు...కి...''

**(వేశ్యల పిల్లల్ని స్కూళ్లల్లో చేర్చాలంటే అక్కడ తండ్రి పేర్లని అడుగుతున్నారని చదివినప్పుడు...)**